## బాసర గోదావరిలో యువకుడి మృతి

బాసర, అక్టోబరు 1 : బాసర వద్ద గోదావరి నదిలోని మొదటి ఘాట్ వద్ద ఆదివారం ఓ యువకుడు గల్లంతైనట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లాలోని హమాల్‌వాడీకి చెందిన సంతోష్ (18) స్నేహితులతో కలిసి బాసర సరస్వతీ అమ్మవారి దర్శనానికి వచ్చాడు. ఈ నేపథ్యంలో గోదావరి వద్ద పుణ్య స్నానం ఆచరించడానికి వెళ్లి నీళ్లలో మునిగి గల్లంతయ్యాడు. మత్స్యకారులు గమనించి వెతుకగా మృతదేహం లభించింది. అనంతరం వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# 'పత్తి' సేకరణకు సర్వం సిద్ధం


ఆదిలాబాద్ మార్కెట్ యార్డు

- ఈ నెల చివరివారంలో సేకరించాలని ప్రణాళికలు
- ఆదిలాబాద్ జిల్లాలో పది సీసీఐ కేంద్రాల ఏర్పాటు
- మార్కెట్‌కు 28.87 లక్షల క్వింటాళ్లు వచ్చే అవకాశం

ఆదిలాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో రైతులు వానకాలం సీజన్‌లో పత్తి పంటను సాగు చేశారు. జిల్లాలో నల్లరేగడి నేలలు ఈ పంట సాగుకు అనుకూలంగా ఉండడం ఇందుకు కారణం. పత్తి సాగు రైతులకు లాభదాయకంగా మారింది. దీంతో ఏటా జిల్లాలో పంట సాగు విస్తీర్ణం పెరుగుతుంది. గతేడాది 3,83,251 ఎకరాల్లో రైతులు తెల్ల బంగారాన్ని పండించగా ఈ ఏడాది 4,12,436 ఎకరాల్లో పంట వేశారు. గతేడాది జిల్లాలో ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధర కంటే ఎక్కువ ధర వెచ్చించి రైతుల నుంచి పంటను కొనుగోలు చేశారు. మద్దతు ధర రూ.6380 ఉంటే రూ.9 వేల వరకు చెల్లించి పంటను సేకరించారు. ఈ ఏడాది పంట కొనుగోళ్లకు అధికారులు పకడ్బందీగా ప్రణాళికలు తయారు చేశారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ ఇటీవల వ్యవసాయ, మార్కెటింగ్, ఫైర్, తూనికలు, కొలతలు, సీసీఐ అధికారులతో సమావేశం నిర్వహించి పంట కొనుగోళ్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా మార్కెట్‌యార్డుల్లో తాగునీరు. ఇతర సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

### ఈ నెల చివరి వారంలో కొనుగోళ్లు

జిల్లాలో పత్తి కొనుగోళ్లను ఈ నెల చివరి వారంలో ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సీజన్‌లో 28.87 లక్షల క్వింటాళ్ల పంట మార్కెట్‌కు వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఆదిలాబాద్, బోథ్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, జైనథ్ మార్కెట్ యార్డుల పరిధిలో పది సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది పత్తి క్వింటాల్‌కు రూ.7020 మద్దతు ధర ప్రకటించింది. గతేడాది క్వింటాల్‌కు రూ. 6380 ఉండగా రూ.640 పెంచింది. పంట సేకరణలో భాగంగా జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో పది కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నారు. ఆదిలాబాద్‌లో రెండు, బేల, ఇచ్చోడ, బోథ్, సొనాల, పొచ్చర, నేరడిగొండ, ఇంద్రవెల్లి, నార్నూర్‌లో మద్దతు ధరతో పంటను సేకరించనున్నారు. సీసీఐ ద్వారా కొనుగోలు చేసిన పత్తిని ప్రాసెసింగ్ చేయడానికి 14 జిన్నింగ్ మిల్లులను అధికారులు గుర్తించారు. రైతులు నుంచి దళారులు పత్తిని తక్కువ ధరకు విక్రయించకుండా వ్యవసాయ, మార్కెటింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. సీసీఐ కేంద్రాల్లో ఆధార్ ఆధారిత పంట కొనుగోళ్లు చేపట్టనున్నారు. ఇందుకోసం అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

### ఆధార్ అథెంటిఫికేషన్ చేయించుకోవాలి



ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది సీసీఐ ఆధార్ ఆధారిత పత్తి కొనుగోళ్లు జరుగనున్నాయి. ఇందుకోసం మార్కెట్ యార్డుల్లో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. రైతులు తమ ఆధార్ రుజువులను విక్రయ కేంద్రాల్లో అందజేయాల్సి ఉంటుంది. ముందుగా రైతులు తమ ఆధార్ అథెంటిఫికేషన్ చేయించుకోవాలి. వేలిముద్రలు రాకుంటే ఐరిశ్, ఫేస్, ఓటీపీ, ఆధార్ క్యూఆర్ కోడ్ ద్వారా ప్రామాణికాన్ని నిర్ధారించుకునే అవకాశాలున్నాయి. జిల్లాలోని పది కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

-శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ అధికారి

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో॥ + వ॥ + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-310380-AII

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# పంట రుణం తీర్చి..హామీని నెరవేర్చి


సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు,రైతులు

- మండలంలో 1297 మంది రైతులకు రుణ మాఫీ
- అన్నదాతల ఖాతాల్లో రూ. 5 కోట్ల 89 లక్షలు జమ
- రైతుల సెల్ ఫోన్లకు రుణమాఫీ మెస్సేజ్‌లు
- రుణ మాఫీతో రైతుల్లో ఆనందం

దస్తురాబాద్, అక్టోబర్ 1 : రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంట్, సకాలంలో ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోళ్లు, సాగు నీటి సౌకర్యం కల్పిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ప్రభుత్వం రైతులు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేస్తూ రైతుల అకౌంట్లలో డబ్బులు జమ చేయడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులు బ్యాంకులో తీసుకున్న పంట రుణాలను విడుతల వారీగా మాఫీ చేస్తున్నారు.

**రూ. 5 కోట్ల 89 లక్షలు మాఫీ**

మండలంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో 1725 మంది రైతులు రూ. 10 కోట్ల 49 లక్షల రుణాలు తీసుకున్నారు. ప్రసుత్తం 1297 మంది రైతుల ఖాతాలో ప్రభుత్వం రూ. 5 కోట్ల 89 లక్షలు రుణమాఫీ కింద జమ చేసింది. ఇంకా 428 మంది రైతులకు రూ. 4 కోట్ల 60 లక్షల విడుతల వారీగా జమ చేయనున్నది.

**అన్నదాతకు చేయూత**

రైతు శ్రేయస్సు కోసం పరితపిస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం అన్నదాతలకు చేయూతనిచ్చింది. అప్పుల్లో చిక్కుకున్న అన్నదాతకు ఇప్పటికే రైతు బంధు, రైతు బీమా వంటి పథకాల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తున్నది. గతంలో ఇచ్చిన మాట ప్రకారం రూ. లక్ష లోపు, లక్ష పైగా పంట రుణాలను మాఫీ చేస్తున్నది. సీఎం కేసీఆర్ పంట రుణ మాఫీ చేసి రైతు బాంధవుడయ్యారు.

### రైతుల ఖాతాల్లో రూ. 5 కోట్ల 89 లక్షలు జమ



తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 1725 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం రుణ మాఫీ ప్రకటించి రైతుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బులను జమ చేస్తున్నది. ఇప్పటి వరకు 1297 మంది రైతుల ఖాతాల్లో రూ. 5 కోట్ల 89 లక్షలు రుణమాఫీ కింద జమ చేసింది. రూ. లక్ష లోపు, లక్షకు పైగా పంట రుణం తీసుకున్న రైతులకు విడుతల వారీగా ప్రభుత్వం డబ్బులను జమ చేస్తున్నది. రుణ మాఫీ అయిన రైతులకు కొత్తగా పంట రుణాలను అందజేస్తున్నాం. 100 మందికి పైగా రైతులకు కొత్త రుణాలను మంజూరు చేశాం. రైతు రుణమాఫితో రైతులకు ఆర్థిక భారం తగ్గనున్నది.

-స్వామి, బ్రాంచ్ మేనేజర్, (టీజీబీ దస్తురాబాద్)

### రూ. 41,333 రుణ మాఫీ అయ్యింది



గతంలో ఏ ప్రభుత్వం రైతుల సంక్షేమం గురించి ఆలోచన చెయ్యలేదు. రైతుల పక్షాన నిలబడిన దాఖలాలు లేవు. తెలంగాణ ప్రభుత్వం పెద్దమనస్సుతో రైతుల రుణాలు మాఫీ చేసేందుకు నిర్ణయం తీసుకుంది. రుణాలు మాఫీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది. నాకు రూ. 41,333 బ్యాంక్ రుణం మాఫీ అయ్యింది. చాలా సంతోషంగా ఉంది. సీఎం కేసీఆర్ రైతుల పక్షాన నిలిచి అన్ని విధాలుగా ఆదుకుంటున్నారు.రుణ మాఫీ చేసి రైతులకు ఆర్థిక భారాన్ని తగ్గించాడు. రైతాంగం సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటుంది.

-గడ్డం పెద్ద కొమురయ్య,రైతు(రేవోజిపేట)

### రుణ మాఫీతో ఎంతో ధీమా..



రైతు రుణ మాఫీతో ఎంతో ధీమాగా ఉంది. రైతులకు రూ. లక్ష వరకు రుణ మాఫీ చేసిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్. రుణ మాఫీ ప్రకటించి మాఫి చేయడం ఎంతో ఆనందంగా ఉంది. నాకు రెండు సార్లు రుణ మాఫీ అయ్యింది. ఈ సారి రూ. 79 వేల బ్యాంక్ రుణం మాఫీ అయ్యింది. సీఎం కేసీఆర్ ఎరువులు, విత్తనాలు, రైతు బంధు తదితర ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణ మాఫీ చేశారు. రైతులకు ఆర్థిక భారం పడకుండా రుణ మాఫీ చేసినందుకు సీఎం కేసీఆర్ కృతజ్ఞతలు.

-దేశవేణి నర్సయ్య,రైతు(రాంపూర్)


రుణమాఫీ డబ్బుల కోసం బ్యాంకుకు వచ్చిన రైతులు

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677